క్లుప్తంగా

పక్కాగా జగనన్న గోరుముద్ద



పరిశీలిస్తున్న ఎంపీపీ సరోజనమ్మ తదితరులు

టెక్కలి: ప్రభుత్వ పాఠశాలల్లో పక్కాగా జగనన్న గోరుముద్ద మెనూ అమలు చేయాలని ఎంపీపీ ఆట్ల సరోజనమ్మ అన్నారు. మండలంలోని పెద్దసాన ప్రాథమికోన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో అమలు చేస్తున్న మెనూపై ఆరా తీశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణ సక్రమంగా లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆమెతో పాటు సర్పంచ్ లోళ్ల వనమమ్మ, కె.కామేశ్వరరావు, ఎల్.జగన్నాథం, జి.మోహన్‌రెడ్డి, ఎస్.హర్షకుమార్, జి.అప్పలరెడ్డి, పి.శ్రీనివాస్, బి.రాజేష్, ఎం.భాస్కర్, సీహెచ్ బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

'పక్కాగా విధులు నిర్వహించాలి'



రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌డీవో

మందస: సచివాలయ ఉద్యోగులు పక్కాగా విధులు నిర్వహించాలని డివిజనల్ లెవల్ డవలప్‌మెంట్ ఆఫీసర్ అలివేలు మంగమ్మ అన్నారు. మండలంలోని చీపి, సాబకోట, మందస 2, 3 సచివాలయాలను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేయాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాల లక్ష్యాలను నెరవేర్చాలన్నారు. వలంటీర్లు వారానికి మూడు సార్లు సచివాలయంలో హాజరుకావాలన్నారు. ఆమెతో పాటు ఎంపీడీవో వాయలపల్లి తిరుమలరావు, ఈవో అన్నెపు వెంకట సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం



బాండ్ పేపర్లు అందజేస్తున్న దృశ్యం

పలాస: మండలంలోని బ్రాహ్మణతర్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న నిరుపేద విద్యార్థులు చరణ్య (10వ తరగతి), మనస్వీ (8వ తరగతి)లకు ఆ పాఠశాలకు చెందిన 1991–92 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు గురువారం ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల విద్యార్థుల తండ్రి బడే రమేష్ అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ విషయం తెలుసుకున్న పాఠశాల పూర్వ విద్యార్థులు రూ.85 వేలు, బ్రాహ్మణతర్లా హెల్పింగ్ వారియర్స్ రూ.45,600లు కలిపి మొత్తం రూ.1,35,600 లను విద్యార్థుల పేరున ఎస్‌బీఐ బ్యాంకులో ఫిక్సిడ్ డిపాజిట్ చేశారు. ఆ బాండ్ పత్రాలను పాఠశాలలో జరిగిన ఒక కార్యక్రమంలో అందజేశారు.

మత్స్యకారులకు శిక్షణ



శిక్షణలో పాల్గొన్న మత్స్యశాఖ అధికారి శ్రీనివాసరావు తదితరులు

సంతబొమ్మాళి: మండలంలోని వడ్డితాండ్రలో అలంకరణ చేపల యాజమాన్య పద్ధతులు, మార్కెటింగ్‌పై గురువారం శిక్షణ నిర్వహించారు. మత్స్యకారుల జీవనోపాధిని పెంపొందించేందుకు శిక్షణ ఉపయోగపడుతుందని జిల్లా మత్స్యశాఖ అధికారి పి.వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ధర్మరాజు పాత్రో, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసరావు, ఈ–ల్యాండ్ కో–అపరేటివ్ సొసైటీ ప్రెసిడెంట్ ఉమాపతి, ఫిషరీస్ అసిస్టెంట్ నరేష్ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'ఆక్రమణలపై చర్యలు తీసుకోండి'



చైర్మన్ గిరిబాబుకు వినతిపత్రం అందజేస్తున్న కౌన్సిలర్ మాధురి

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ 20వ వార్డులో ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ప్రభుత్వ పోరంబోకు స్థలంలో జరుగుతున్న ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని ఆ వార్డు కౌన్సిలర్ అంబటి మాధురి కోరారు. ఈ మేరకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ గిరిబాబు, కమిషనర్ రాజగోపాలరావుకు గురువారం వినతిపత్రం అందించారు. స్థలంలో సర్వే నిర్వహించి కార్మికులకు అవసరమయ్యే కల్యాణ మండపం ఏర్పాటు చేయాలని కోరారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజా సంక్షేమానికి రెట్టింపు భరోసానిచ్చింది. పట్టణాభివృద్ధికి రూ.931 కోట్లు కేటాయించడం, రాష్ట్ర భవిష్యత్‌ని దృష్టిలో ఉంచుకొని స్కిల్ డవలప్‌మెంట్‌కి రూ.116 కోట్లు, డ్వాక్రా మహిళల వడ్డీలేని రుణాలకు రూ.500 కోట్లు కేటాయించడం శుభపరిణామంగా చెప్పుకోవచ్చు.

– పిలక రాజలక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్, ఇచ్ఛాపురం

జనరంజక బడ్జెట్

రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి గురువారం అసెంబ్లీలో 2023–24 సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై అన్ని వర్గాలవారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇది జనరంజక బడ్జెట్ అని, వ్యవసాయం, వైద్యం, విద్యా తదితర రంగాలకు మేలు చేసేలా ఉందన్నారు. – సాక్షి నెట్‌వర్క్

మేలు చేసే బడ్జెట్



ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ అన్నివర్గాల ప్రజలకు మేలు చేసేదిగా ఉంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా అన్ని రంగాలకు అత్యధికంగా బడ్జెట్ కేటాయించడం హర్షణీయం. ప్రధానంగా బీసీ సంక్షేమానికి రూ.23,509 కోట్లు, వైద్యారోగ్య శాఖలకు రూ.15,882 కోట్లు, వ్యవసాయ రంగానికి మరో రూ.11,589 కోట్లు కేటాయించి పెద్దపీట వేశారు. ఈ బడ్జెట్ అమోదయోగ్యమైనది.

– పుక్కళ్ల గురయ్యనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, వజ్రపుకొత్తూరు మండలం

అభివృద్ధికి ప్రాధాన్యత



బడ్జెట్‌లో గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వం అభివృద్ధికి ప్రాధాన్యమిచ్చింది. పశుసంవర్ధక శాఖకు రూ.1,787 కోట్లు కేటాయిండంతో పాడి రైతుకు మేలు జరుగుతుంది. అలాగే విద్య, వైద్యం, ఇతర సంక్షేమ పథకాలకు భారీగా నిధులు కేటాయించడం అభినందనీయం.

– ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు, వజ్రపుకొత్తూరు మండలం

రైతు సంక్షేమానికి పెద్దపీట



2023–24 వార్షిక బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేసింది. బడ్జెట్‌తో వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న అన్నదాతలకు తప్పకుండా మేలు జరుగుతుంది. అదే విధంగా వైద్య, విద్య రంగాలకు ప్రత్యేక నిధులు మంజూరు చేసి అధిక ప్రాధాన్యమిచ్చారు.

– రోక్కళ్ల గోపాలరెడ్డి, విశ్రాంత హెచ్‌ఎం, ఇచ్ఛాపురం

నర్తుకు శుభాకాంక్షలు



కవిటి: నర్తు రామారావుకు శుభాకాంక్షలు చెబుతున్న పిరియా సాయిరాజ్ తదితరులు



ఇచ్ఛాపురం: రామారావుకి అభినందనలు తెలుపుతున్న భారతి దివ్య

కవిటి: శ్రీకాకుళం జిల్లా స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీగా గెలిపొందిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థి నర్తు రామారావుకు ఆ పార్టీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ శుభాకాంక్షలు తెలిపారు. గురువారం ఓట్ల లెక్కింపు అనంతరం ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. పుష్ప గుచ్ఛాన్ని రామారావుకు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొన్నారు.

సోంపేట: ఎమ్మెల్సీగా విజయం సాధించిన నర్తు రామారావుకు ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, జెడ్పీటీసీ తడక యశోద, మండల కమిటీ అధ్యక్షుడు తడక జోగారావు తదితరులు శ్రీకాకుళంలో అభినందనలు తెలియజేశారు. ఆయనను గజమాలతో సత్కరించారు.

ఇచ్ఛాపురం: స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా విజయం సాధించిన నర్తు రామారావుకు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉలాల భారతి దివ్య, వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగ జిల్లా అధ్యక్షుడు తాడి ఆదిరెడ్డి, పిలక సంతు, పరపటి కోటి, నీలాపు డిల్లీ, ప్రకాషరావు పట్నాయక్, మున్సిపల్ తదితరులు అభినందనలు తెలియజేశారు.

వజ్రపుకొత్తూరు రూరల్: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి నర్తు రామరావు విజయం రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ విజయానికి తార్కాణమని ఎంపీపీ ఉప్పరపల్లి నీలవేణి అన్నారు. మండలంలోని పల్లిసారథిలో ఆమె మాట్లాడుతూ నర్తు రామారావు గెలుపుతో పార్టీలో మరింత ఉత్సాహం వచ్చిందన్నారు. అలాగే వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పుక్కళ్ల గురయ్య నాయుడు అభినందనలు తెలియజేశారు.

హర్షణీయం

కవిటి: ఎమ్మెల్సీగా నర్తు రామారావు అఖండ విజయం సాధించడం హర్షణీయమని ఆ పార్టీ నేతలు అభిప్రాయపడ్డారు. ఈ మేరకు మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ.. విజయానికి జిల్లా నాయకులు చేసిన కృషి మరువలేనిదన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ జల్లు యుగంధర్, పీఏసీఎస్ చైర్మన్ దేవరాజ్‌సాహూ, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పూడి లక్ష్మణరావు, వైస్ ఎంపీపీలు పూడి నేతాజీ, కర్రి గోపయ్య, పి.నీలాచలం, మండల కో–ఆప్షన్ సభ్యుడు పి.శేఖర్, పి.జయరావు, డి.ధర్మారావు, బి.రమణ, జన్ని లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

ధన్యవాదాలు

కాశీబుగ్గ: నర్తు రామారావు విజయం సాధించడం సంతోషకరమని, ఆయనకు ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ యాదవుల తరుపున ధన్యవాదాలు తెలుపుతున్నామని అఖిల భారత యాదవ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు రాపాక చిన్నారావు యాదవ్, పలాస మండలం ఉపాధ్యక్షుడు కోరాడ లింగమూర్తియాదవ్ గురువారం ప్రకటనలో తెలియజేశారు.



కవిటి: మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

'ప్రత్యేక పర్యవేక్షణ అవసరం'



హాస్టల్ వార్డెన్‌తో మాట్లాడుతున్న రామ్మోహన్‌రావు

టెక్కలి: పోలవరం గ్రామంలోని బీసీ బాలుర వసతి గృహంలో ఇటీవల చోటుచేసుకున్న సంఘటన పునరావృతం కాకుండా విద్యార్థులపై ప్రత్యేక పర్యవేక్షణ అవసరమని వైఎస్సార్‌సీపీ నాయకుడు డాక్టర్ కిల్లి రామ్మోహన్‌రావు సూచించారు. గురువారం వసతి గృహాన్ని సందర్శించి వార్డెన్‌తో మాట్లాడారు. పరిస్థితి అదుపులోకి వచ్చేంతవరకు వైద్య, ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. ఆయనతో పాటు ఎంపీటీసీ డి.కూర్మారావు, స్థానిక నాయకులు కృష్ణ, జగన్, జగతి, రామారావు తదితరులు ఉన్నారు.

జాతీయ స్థాయి సెమినార్ నేడు



ప్రిన్సిపాల్ గోవిందమ్మ

టెక్కలి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ స్థాయి సెమినార్ శుక్రవారం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ గురువారం తెలియజేశారు. కళాశాలకు చెందిన పూర్వ విద్యార్థుల సౌజన్యంతో తెలుగు, ఇంగ్లిష్, హిందీ, ఒడియా తదితర భాషల్లో ఈ సెమినార్‌ను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కవిత్వంలో మహిళ, కథా సాహిత్యంలో మహిళ, నవలా సాహిత్యంలో మహిళ, నాటకంలో మహిళ, జీవిత/స్వీయ చరిత్రలో మహిళ అనే ఉప అంశాలతో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి తెలుగు అకాడమీ చైర్‌పర్సన్ డాక్టర్ నందమూరి లక్ష్మీపార్వతి, అంబేద్కర్ యూనివర్సిటీ వీసీ నిమ్మ వెంకటరావు, రచయిత ఎం.ఎస్.వి.గంగరాజు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలియజేశారు.

ఆర్థిక సాయం అందజేత



అరుణ్‌కుమార్‌కు నగదు అందజేస్తున్న దాతలు

కవిటి: కంచిలి మండలంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న నీలగిరి అరుణ్‌కుమార్ కొడుకు జస్వంత్ వైద్యం కోసం కవిటి మండలం కపాసుకుద్ది ఉపాధి హామీ పథకం సిబ్బంది ఆపన్నహస్తం అందించారు. గురువారం కవిటి కొత్తూరులో అరుణ్‌కుమార్ నివాసానికి వెళ్లి తమ వంతుగా రూ.71,300 ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఏపీవో కడియం భాస్కరరావు, టెక్నికల్ అసిస్టెంట్ తలగాన మోహనరావు, డీవో పాల్లాయి హేమాచలం, కీలు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

కంచిలి: మండల కేంద్రం పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ ఎస్.గురవయ్య గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. పట్టణ పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్ల కండెక్టర్లు, పాడైన విద్యుత్ స్తంభాలు మార్చే ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలియజేశారు. వినియోగదారులంతా గమనించి, సహకరించాల్సిందిగా కోరారు.

'గరిష్ట వేతనం పొందాలి'

కోటబొమ్మాళి: ఉపాధి హామీ పనుల్లో వేతనదారులు గరిష్ట వేతనం పొందేలా చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ జీవీ చిట్టిరాజు అన్నారు. మండలంలోని హరిశ్చంద్రపురం, ఎత్తురాళ్లపాడు, బంజరుపేట గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను గురువారం పరిశీలించారు. అనంతరం సంతబొమ్మాళి, కోటబొమ్మాళి ఉపాధి సిబ్బందితో సమీక్ష చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు గురువెల్లి కేశవరావు, తలగాన గణపతిరావు, ఏపీవో హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బహుమతులు అందజేత

కాశీబుగ్గ: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భముగా కాశీబుగ్గ ఒడియా ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు కాశీబుగ్గ ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ సెక్షన్ ఆఫీసర్ బి.లక్ష్మీనారాయణ, బ్రాంచి ఆఫీసర్ జీవీ కృష్ణారావు చేతులు మీదుగా బహుమతులు గురువారం అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కృష్ణచంద్ర పాత్రో, సీఆర్పీ ఉర్జాన అప్పలరాజు, అయా సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి

అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. భాషా ప్రాతిపదికన ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు ఆమరణ నిరాహార దీక్షచేసి ప్రాణత్యాగం చేశారన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. –సాక్షి నెట్‌వర్క్



సంతబొమ్మాళి: అమరజీవి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



కంచిలి: జలంత్రకోటలో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



కోటబొమ్మాళి: పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఆఫ్‌షోర్‌పై అచ్చెన్నకు అవగాహన లేదు



మాట్లాడుతున్న పేరాడ తిలక్ తదితరులు

- శరవేగంగా పనులు
- రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్

నందిగాం: ఆఫ్‌షోర్‌పై కనీస అవగాహన లేకుండా అసెంబ్లీలో అచ్చెన్నాయుడు మాట్లాడుతున్నాడని రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ.. టెక్కలి నియోజకవర్గంలో నందిగాం మండలానికి అత్యంత ఆవశ్యకమైన ఆఫ్‌షోర్ ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగుతుంటే, స్థానిక ఎమ్మెల్యే అచ్చెన్నాయుడు పనులు జరగడం లేదని చెప్పడం హాస్యాస్పదమన్నారు. సమాచారం తెలుసుకోకుండా అబద్ధాలు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. నియోజకవర్గానికి నాలుగేళ్లుగా దూరంగా ఉంటున్న అచ్చెన్నకు అభివృద్ధి గురించి తెలియదని ఎద్దేవా చేశారు. సమావేశంలో ఆయనతో పాటు ఎంపీపీ ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, మడపాల సంజీవరావు, చిన్ని జోగారావు, తమిరె రాజు, బొమ్మాలి గున్నయ్య తదితరులు ఉన్నారు.

400 ఎకరాలకు సాగునీరు



కాలువ మరమ్మతులు చేపడుతున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు: పాత టెక్కలిలో రైతుల సహకారంతో బాగు చేసిన సాగునీటి కాలువతో 400 ఎకరాలకు నీరు అందుతుందని వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యుడు బాలక శ్రీనివాసరావు అన్నారు. గత మూడు రోజులుగా ఐదు కిలో మీటర్ల మేర కాలువలో చేపడుతున్న పూడిక తీసే పనులు గురువారంతో ముగిసియి. 20 ఏళ్లుగా శిధిలావస్థలో ఉన్న కాలువను బాగు చేసేందుకు గత పాలకులు ఎవరూ ముందుకు రాలేదన్నారు. సర్పంచ్ టి.సుశీల, పార్టీ నాయకులు దాసరి దాలయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొల్లి జోగారావు ఆధ్వర్యంలో రైతుల సహకారంతో రూ.1.50 లక్షలు వెచ్చించి, పెద్ద చెరువు దిగువ భాగం నుంచి దొడ్డ రామచంద్రాపురం చెరువు వరకు ప్రొక్లెయినర్‌తో కాలువ పనులు పూర్తి చేశారు. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

'గుర్తింపు కార్డులు పొందాలి'



గుర్తింపు కార్డులు అందజేస్తున్న సూర్యనారాయణ

సోంపేట: భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం అందజేస్తున్న కార్మిక గుర్తింపు కార్డుతో అధిక ప్రయోజనం చేకూరుతుందని సోంపేట సహాయ కార్మికాధికారి పి.సూర్యనారాయణ అన్నారు. పట్టణంలోని కార్యాలయంలో పలువురు కార్మికులకు గురువారం గుర్తింపు కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సోంపేట సహాయ కార్మిక శాఖ పరిధిలో 20,706 మంది కార్మికులు తమ పేర్లును నమోదు చేసుకున్నారన్నారు. పేర్లు నమోదు చేసుకున్న చాలామంది గుర్తింపు కార్డులు పొందలేదని పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరూ గుర్తింపు కార్డు పొందాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

తోట సత్యనారాయణ మృతి



తోట సత్యనారాయణ (ఫైల్)

వజ్రపుకొత్తూరు: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తోట సత్యనారాయణ(70) గురువారం మృతి చెందారు. గత మూడేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన స్వగ్రామం పాత టెక్కలిలో తుదిశ్వాస విడిచారు. తొలితరం నేతగా క్రియాశీలక రాజకీయాల్లో అప్పటి పీసీసీ అధ్యక్షుడు మజ్జి తులసీదాస్, బొడ్డేపల్లి రాజగోపాలరావు, హనుమంతు అప్పయ్యదొర, మంత్రి ధర్మాన ప్రసాదరావు, సత్తారు లోకనాథం నాయుడు, గొర్లె హరిబాబు నాయుడు తదితరులతో సన్నిహిత సంబంధాలు కొనసాగించారు. వైఎస్సార్‌తో పాదయాత్రలో కలిసి నడిచారు. ఆయన మృతితో మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు కుటుంబ సభ్యులకు ఫోన్‌చేసి మాట్లాడారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటు అని అన్నారు. శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఆత్మవిశ్వాసం అవసరం

మందస: విద్యార్థినులకు ఆత్మవిశ్వాసం అవసరమని స్ఫూర్తి పోలీసుల టీమ్ సభ్యులు అన్నారు. జిల్లా పోలీసుశాఖ, స్ఫూర్తి పోలీసుల ఆధ్వర్యంలో స్థానిక గురుకులంలో మహిళల భద్రత–మా బాధ్యత అనే కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థినులు సమాజంలో జాగ్రత్తగా మెలగాలని సూచించారు. మోసం చేయడానికి చెప్పే మాయ మాటలను అర్థం చేసుకొని, తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం దాడులు, మోసాలను ఎలా ఎదుర్కోవాలో తెలియజేస్తూ నాటికను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎస్ఐ వై.రవికుమార్, ప్రిన్సిపాల్ రఘుపాత్రుని సుభాషిణి, స్ఫూర్తి సిబ్బంది జీవరత్నం, రవి, అనూష, కుసుమలత, మోహిని, మురళీ, సత్యరాజ్, జంగమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

కవిటి: మండలంలోని సీహెచ్ కపాసుకుద్దిలో ప్రజలకు జ్వరాలు ప్రబలినట్లు స్థానికుల నుంచి వచ్చిన సమాచారం మేరకు రాజపురం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఉచిత వైద్య శిబిరం గురువారం ఏర్పాటు చేశారు. శిబిరంలో డాక్టర్ శశిధర్ తదితర సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. నాలుగు రోజుల పాటు గ్రామంలోనే వైద్య శిబిరం కొనసాగించనున్నట్లు ఎంపీహెచ్‌ఈవో అభిమన్యుసోయి తెలిపారు.

ఫ్యాన్‌ల వితరణ

కాశీబుగ్గ: పలాస మండలం రెంటికోట అంగన్‌వాడీ కేంద్రానికి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సీలింగ్ ఫ్యాన్‌లు వితరణగా గురువారం అందజేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నెయలిపురి అప్పారావు ఆర్థిక సాయంతో అందించారు. అనంతరం పిల్లలకు మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సెక్రటరీ తమ్మినాన మాధవరావు, ప్రవాసాంధ్రులు ఎల్ఎన్ హేమాచలం, డా.తెప్పల కృష్ణరావు, కొండలరావు, గ్రామ పెద్దలు బోల్లొబదొర, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చీరకు నిప్పంటుకొని మహిళకు గాయాలు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని ఈదుపురం గ్రామానికి చెందిన గయా అన్నపూర్ణ బుధవారం రాత్రి ఎండు రొయ్యలను కాల్చుతుండగా, ప్రమాదవశాత్తు చీరకు నిప్పంటుకోవడంతో గాయపడింది. దీంతో స్థానికులు హుటాహుటిన 108కు సమాచారం అందించి ఇచ్ఛాపురం సామాజిక ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అందించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం బరంపురం ఎంకేజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం ఆమె కొలుకుంటోందని బంధువులు తెలిపారు.

ఉద్దాన రైతులకు నాబార్డు సాయం

మందస: ఉద్దానంలోని రైతులకు నాబార్డు నిధులతో సాయమందివ్వడానికి చర్యలు తీసుకుంటున్నట్టు డాక్టర్ వైఎస్సార్ ఉద్యానవన యూనివర్సిటీ బోర్డు సభ్యుడు బత్తిని లక్ష్మణ్ చెప్పారు. మందస మండలం హరిపురంలో రైతు ఉత్పత్తుల సంఘం అధికారులతో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్దానాన్ని ఆదుకుంటోందన్నారు. సుదీర్ఘ సమస్యలను పరిష్కరిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉద్దానంలో రైతులకు నాబార్డు నిధులతో ఆదుకోవడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఉద్దానం ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ ద్వారా ఇప్పటి వరకు 68 సంఘాలను ఏర్పాటు చేసి, 680 మంది రైతులకు సహాయ, సహకారాలు అందిస్తున్నామన్నారు. దళారుల ప్రమేయం లేకుండా మద్దతు ధరకే రైతు ఉత్పత్తులను కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. రైతు ఉత్పత్తుల సంఘం సీఈఓ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ కొన్ని సంఘాలకు వడ్డీలేని రుణాలను అందజేశామన్నారు. సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు అందజేస్తామన్నారు. సమావేశంలో ఉద్దానం ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ ప్రతినిధులు ప్రియాంక, తారకేశ్వరరావు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ దర్యాప్తు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని మశాఖపురం గ్రామానికి చెందిన టీడీపీ సర్పంచ్ ఆశి తులసమ్మ, టీడీపీ నాయకుడు ఆశి మాధవరెడ్డితో పాటు మరో పదిమంది స్థానిక దళితులను కులం పేరుతో దూషించి, దాడి చేశారంటూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాశీబుగ్గ డీఎస్పీ ఎం.శివరామిరెడ్డి దర్యాప్తు చేపట్టారు. గురువారం సీఐ ఆర్.ఈశ్వరచంద్ర ప్రసాద్‌తో కలసి గ్రామానికి వెళ్లి విచారించారు. బాధితులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగిందని, ఇరువర్గాలకు విచారణ పూర్తైన తర్వాత వివరాలు తెలియజేయడం జరుగుతుందన్నారు.